# గుడిసెలు కూలిపోతున్నాయ్!

బాబోయ్! గుడిసెలు కూలిపోతున్నాయ్! గుడిసెలు కూలిపోతున్నాయ్! అమ్మో! అబ్బో! మా గుడిసెలు కూలిపోతున్నాయ్ ఒకటే అరుపులు కేకలు ఏడుపులు పెడబొబ్బలు. జనం అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు. మంటలయితే నీళ్ళతో ఆర్పేసుకునేవారు. కాని అవి బ్రహ్మరాక్షసి కంటే భయంకరమైన బుల్‌డోజర్లు. ఒక్కొక్క గుడిసె నేలమట్టమైపోతోంది. ఎవరి గుడిసెలోని సామానులు వారు బయట పడేసుకుంటూ రోదిస్తున్నారు. వారి రోదనలకు చెట్లు, చేమలు, ఎగిరే పక్షులు, తిరిగే జంతువులు, చివరకు పెంచుకునే కోళ్ళు కూడా రోదిస్తున్నాయి. ఆ రోదనలు వీచే గాలిలో కలిసిపోతున్నాయి. ఆ గుడిసెవాసుల రోదనలు మాత్రం ఆ బుల్‌డోజర్ల చెవికెక్కడం లేదు. వాటిని నడిపించే వారి గుండెలు కరగడంలేదు. ఆ బుల్‌డోజర్లు నడిపే వారికి గుండెలున్నా ఏం చెయ్యలేకపోతున్నారు.

బాధతో నలిగిపోతున్నా! వారేమి చెయ్యగలరు? వారు పొట్టకోసం పని చేసే కూలీలే! వారి జాలి దయ ఎవరికి పట్టదు. అది పాపకృత్యమో! పుణ్యకృత్యమో వాటితో సంబంధం లేదు. యజమాని చెప్పిన పని చేసుకుపోవాలి అంతే! వారి పని వారు చేసుకుపోతున్నారు.

ఆ స్థలాలు ఎవరివో? ఎప్పుడో కొని పెట్టుకున్నారు. తరువాత వాళ్ళు ఆ స్థలం సంగతి పట్టించుకోలేదు. వారు విదేశాల్లో వ్యాపారం చేస్తున్నారు. ఇప్పుడు ఇక్కడ ఓ ఫ్యాక్టరీని కట్టాలని వచ్చారుట. ఈ లోపుగా ఈ స్థలం ఎవరో ఆక్రమించి నరసింహం చేత అమ్మించేసారు.

“అభం శుభం తెలియని గుడిసెవాసుల దగ్గర డబ్బు పుచ్చుకుని అంట కట్టారుట”. అలా కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా నరసింహం చేతిలో మోసపోయి ఉన్న డబ్బంతా పోగొట్టుకున్నారు.

రెక్కలు ముక్కలు చేసుకుని కూలి పని చేసి సంపాదించినదంతా ఆ గుడిసెమీద పెట్టారు. ఆ డబ్బు ఇప్పుడు నేలపాలయింది.

అందరూ తలో విధంగా బాధపడుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం అనుకున్నారు కొందరు.

"ఏది ఏమయినా ఆ నరసింహంగాడిని పట్టుకుని తన్నాలి అప్పుడు కాని బుద్ధిరాదు అనుకున్నారు" కొందరు.

"అడిని తన్నితే మనకేటిరా? అడిని పట్టుకుని అసలు అమ్మినోడెవరో తెలుసుకోవాలా? మనకి మరోచోటైనా నేల ఇప్పించుకోవాలా?" అన్నారు మరికొందరు. కొండంత ఆశతో నరసింహం కోసం వెతకడం మొదలు పెట్టారు కొందరు.

ఆ స్థలం కొని గుడిసె కట్టుకున్న నాటి సంఘటన చంద్రయ్య కళ్ళముందు కదిలింది.

"సత్తెమ్మా! ఇన్నావుటే, రెండేలు కావాలిట. గుడిసెలేసుకోడానికి పదిగజాల జాగా దొరుకుద్దట. చంద్రయ్య సంతోషంగా భార్యతో చెప్పాడు. అలా చెబుతుంటే గుండెలు గుబగుబలాడాయి సత్తెమ్మకు. ఆ దంపతులకు పెళ్ళయిన కొత్తరోజులవి "ఏటేటి రెండేలా? ఏడనుంచి తేగలం?" అంది సత్తెమ్మ నిరాశగా!

మనం! సిట్టీ కట్టిన డబ్బు ఒక వెయ్యి ఉన్నది. నేను పనిచేసే కాడ అయిదొందలు నువ్వు పనిచేసేగాడ అయిదొందలు తేవాలా! చంద్రయ్య మాటలు పెళ్ళాం సత్తెమ్మ మనసులో సందడిచేశాయి.

అనుకున్నట్లుగా డబ్బు సమకూర్చుకున్నారు. నరసింహం చేతిలో డబ్బు పడగానే ఇంకేముంది 10 గజాల స్థలం చంద్రయ్య, సత్తెమ్మ దంపతులకు పట్టా ఇచ్చేసారు.

నాలుగు రోజులు కష్టపడి భార్యా భర్తలు కలిసి ఓ గుడిసె తయారు చేసుకున్నారు. అప్పు చేసిన వారి దగ్గర శరీర కష్టంతోనే తీర్చుకోవాలనే విషయం గుర్తుకు రాలేదు. చమటోడ్చి పని చెయ్యడం వారిలోని ప్రత్యేకత. అదేవారికి జీవనాధారం. అదే వారి పాలిటి శాపం కూడా! ఈ దేశంలో శ్రమను గౌరవించే వ్యక్తులే పుట్టలేదేమో ఇంకా!" అని అనిపించక మానదు.

"ఈడనే మన బతుకులు తెల్లారిపోతాయ్" అనుకున్న చంద్రయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవి సంతోషం వల్ల పొంగినవి.

నులక మంచం కొని తెచ్చి గుడిసెలో వేసాడు చంద్రయ్య. కాస్తమాసి చిరిగిన ఓ దుప్పటి పరిచింది సత్తెమ్మ. సంతోషంతో గుమ్మాలకు పచ్చని మామిడాకులు

కట్టారు. వీధి గడప దగ్గర నీళ్ళు జల్లి ముగ్గు వేసింది సత్తెమ్మ. ఆ రోజు పోచమ్మ గుడిలో కొబ్బరికాయ కొట్టారు. అమ్మోరుకి బోనాలు చేస్తామని మొక్కుకున్నారు ఆ దంపతులు. ఆ రోజు నులకమంచమే పందిరి మంచంలా మురిసిపోతూ ఆ దంపతులు నిద్రపోయారు. ఆ దంపతులు ఆ గుడిసెకున్న కిటికిలోంచి చూస్తూ చంద్రుడు నవ్వుకుంటూ దాటిపోయాడు.

రోజులు, నెలలు గడుస్తున్నాయి. పెంచుకుంటున్న కోడిపెట్ట గుడ్లు పెట్టింది. అవి పిల్లలై కిచకిచమంటూ ఇల్లంతా సందడి చేస్తున్నాయి.

ఆ ముంగిట్లో తవ్వి నీళ్ళుపోసి బంతిమొక్కలు నాటింది. మందారం కరివేపాకు కొమ్మలు తెచ్చి పెట్టింది. బంతి మొక్కలు పెరిగి పువ్వులు పూస్తున్నాయి. మందారం, కరిపేరం కొమ్మలు వేళ్ళుపట్టి మొక్కలై ఇప్పుడు పువ్వులు పూస్తున్నాయి. సత్తెమ్మ వాటిని జడలో తురుముకుని మురిసిపోతోంది.

ఆ రోజు కూలిపని నుంచి గుడిసె చేరుకున్న సత్తెమ్మ కళ్ళు తిరిగాయి. పైగా వాంతి చేసుకుంది. అంజమ్మ, లక్ష్మమ్మ, పోచమ్మ, అందరు చుట్టూ చేరారు. నీళ్ళోసుకున్నావే ఇంకేటి? నీ కడుపు పండిందే? వచ్చినవాళ్ళు వేళాకోళం చేసారు. ఆ రాత్రి యింటికి వచ్చిన చంద్రయ్య మురిసిపోయాడు. తెల్లారి కోఠీ దవాఖానాకు తీసుకుపోయి చూపించాడు. పదిరూపాయల నోటు చేతిలో పెట్టగానే ఆయమ్మ డాక్టరు దగ్గరకు పంపింది. మూడవ నెలని చెప్పింది ఆ డాక్టరమ్మ. చంద్రయ్య అపురూపంగా, సత్తెమ్మను చెయ్యిపట్టుకుని బస్సు ఎక్కించి ఇంటికి తీసుకువచ్చాడు. "ఈడకొచ్చిన ఏల బాగున్నదే సత్తెమ్మా! ఈ గుడిసె అచ్చొచ్చింది. నీకు ఆడ, మగ ఏ పోరికావాలా?" మురిపెంగా అడిగాడు చంద్రయ్య. రెండు వేళ్ళు చూపించింది సత్తెమ్మ.

ఆ రాత్రి సత్తెమ్మ మొగుడి వడిలో వాలిపోయింది. మురిపెంగా గుండెలకు హత్తుకున్నాడు చంద్రయ్య.

సత్తెమ్మకు నెలలు నిండాయి. 2, 3, రోజుల్లో కాన్పు కావచ్చన్నారు. నొప్పులు ప్రారంభం కాగానె ఆసుపత్రికి రమ్మనమని డాక్టరమ్మ చెప్పింది. ఇంక పనికి వెళ్ళలేకపోతోంది సత్తెమ్మ. ఇంటి దగ్గరే కాస్తదూరంలో కోడి గుడ్లు అమ్మి ఆ డబ్బుతో ఉల్లిగడ్డలు కూరలు, కొని తెచ్చుకుంటోంది.

ఒక రోజు ఇంకా సూర్యుడు కన్ను విప్పి బాగా చూడనే లేదు. వారి కలలు కల్లలై పోయాయి.

గుడిసెలు నేలమట్టమై పోతున్నాయి. ఆ ఆందోళనకి సత్తెమ్మకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆ కూలి బతుకులకు తోటి కూలీలె తోడు, నీడ. ఎవరి సామాను వారు బయట పెట్టుకుంటున్నారు. చంద్రయ్య కంగారు పడ్డాడు. గుడిసెలోంచి గిన్నెలు, తప్పేలాలు, నులక మంచం, బట్టల మూట బయటకు తెచ్చాడు. ఆ సమయంలో భార్యను ఆసుపత్రికి తీసుకువెళ్ళలేకపోయాడు.

కూలిపోతున్న ఆ గుడిసెలకు కాస్త దూరంలో ఓ నేరేడు చెట్టు నీడలో నులకమంచం వాల్చి పక్కపరిచి సత్తెమ్మను పడుకోపెట్టారు. బట్టల మూట విప్పి ఓ పాత చీర తీసి చుట్టూ కట్టారు. అదే పురిటి గది చేసారు. సత్తెమ్మ నొప్పుల బాధ పడలేక అరుస్తున్న అరుపులకు చుట్టు పక్కల ప్రాణాలు బిత్తరపోయి బాధగా చూస్తున్నాయి. చంద్రయ్య కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. బిడ్డకు జన్మనివ్వడ మంటే మరో జన్మఎత్తినట్లే!

సత్తెమ్మ ఆ చావుకేకల్లోనే చంటి పిల్ల ఏడుపు వినబడింది. అందరి ముఖాల్లో సంతోషం. గుడిసె కూలిన బెంగల్లోంచే మబ్బులమధ్య వెలిగే చంద్రరేఖలా చంద్రయ్య ముఖంలో సంతోష రేఖ మెరిసింది. 3 రోజులు ఆరుబయట చలిగాలిలో, ఎండవేడిలో అందరితోపాటు ఆ బాలింతరాలు ఉండిపోయింది. ఆడపిల్లే పుట్టింది. పుట్టకుండానే కష్టాలు చవిచూచిన ఆ పసిపిల్ల ఎండ, చలి, గాలికి చలించలేదు. తల్లి దగ్గర పాలు తాగుతూ కేరింతలు కొడుతోంది.

ఈలోపుగా నరసింహాన్ని పట్టుకుని బలవంతంగా అక్కడికి లాక్కువచ్చారు.

"తాను మోసపోయానని అతను బావురుమన్నాడు" మరోచోట అక్కడికి మరింత దూరంలో మరో స్థలాలు అందరికీ కేటాయించారని చెప్పాడు.

"డబ్బెంత కట్టాలి?" కొందరు కోపంతో ముందుకొచ్చారు.

"ఎంతోకాదు బాబు! ఇప్పుడు రేట్లు పెరిగాయి కదా! ఒక్క వెయ్యి రూపాయలు అంతే!"

"అవి ఎవరి భూములు! అన్నీ మేం చూడాలన్నారు కొందరు. అన్ని దస్తావేజులు చూసారు. అవి పోరం బోకుం భూములు ఎవరి స్థలాలు కావు" నిర్ధారణ చేసుకున్నారు.

"అక్కడకు సామానుతో పోయి తిరిగి గుడిసెలు వేసుకోవాలి? అందరు ఒక ఒప్పందానికి వచ్చారు. చంద్రయ్య కూడా వారినే అనుసరించాడు. అంతకంటే సొంతంగా ఏమీ చెయ్యలేడు. వారి బతుకులు అంతే!

చంద్రయ్య తండ్రి యాదయ్యకు కూడా ఒక గుడిసె ఉండేది. అది అతను కట్టుకున్నదే! పట్నం పెరిగిపోతోంది. అక్కడ గుడిసెలు ఉండకూడదు. రోడ్డు వెడల్పు చేస్తున్నారు. గుడిసెలు కూల్చేస్తారు. మరోచోట జాగా ఇచ్చామన్నారు. అది చూడకుండానే యాదయ్య కన్నుమూసాడు. చంద్రయ్య దానికోసం చాలా ప్రయత్నించాడు. కాని దాని ఆ చూకీ మాత్రం తెలియలేదు.

"జాగా కొనుక్కోడమంటే మాటలు కాదురా? ఎన్నో చూసుకోవాలి? కాని అవేమి మిగలవురా? మనదికాకపోతే అదే నేలమట్టమవుతుందిరా!" అనేవాడు.

"ఇప్పుడు అదే జరిగింది". చంద్రయ్య మనసు వికలమై పై గుడ్డతీసి కళ్ళొత్తుకున్నాడు.

తిరిగి కొత్తచోటు చూసి వచ్చారు. కొందరు బాగుందన్నారు. మూడురోజుల బాలింతరాలు చంటిపిల్ల నెత్తుకుంది. కాలికి చెప్పులు కూడా లేవు. తలకి ఓ పాత గుడ్డ కట్టుకుంది. పసిదానికి మరో పాత గుడ్డ కప్పింది. చంద్రయ్య నులకమంచం తలకు ఎత్తాడు పాతబట్టల మూట, పాత గిన్నెల మూట దానిపై పెట్టి అందరితో అడుగులేసాడు. సాయం కాలమయింది. చీకటి అంధకారం. చెట్ల నీడలే ఇల్లు వాకిల్లుగా ఆ రాత్రి నిద్రపోయారు. తెల్లారింది. ఎలాగో అలాగ పాకలేసుకోవాలి. ఒకరికి ఒకరు తోడుగా నిలిచారు.

ఎక్కడో దూరంగా కాకుల అరుపులు గందరగోళం. "ఆ స్థలం ఎవరిదో తిరిగి గుడిసెలు కూలిపోతున్నాయి. అందరు బాధగా అటువైపు చూసారు. వారు ఆశ్చర్యపోలేదు. ఆ మాదిరి దెబ్బలు అలవాటైపోయాయి.

కొత్త గుడిసెలు వేసుకున్నారు. సత్తెమ్మ అలికి ముగ్గు పెట్టుకుంది. కోడి పిట్టను కొని తెచ్చుకుంది. చంటి పిల్లకు చంద్రయ్య కొత్త గౌను కొని తెచ్చాడు. వేడి నీళ్ళు కాచి పోసింది సత్తెమ్మ. పౌడరు రాసి బుగ్గన చుక్కపెట్టి కొత్తగౌను తొడిగింది. పసిపిల్ల పకపకా నవ్వుతుంటే సత్తెమ్మ చంద్రయ్య దంపతులు, సర్వం మరచి కూతుర్ని చూసి మురిసిపోయారు.

ఎక్కడో దూరంగా గుడిసెలు కూలిపోతున్న చప్పుడు కర్ణకఠోరంగా వినబడుతోంది. గుడిసెలు కూలిపోతున్నాయి. గుడిసెలు కూలిపోతున్నాయి. జనుల హాహా కారాలు భయంకరంగా వినబడుతున్నాయి.

*నేటి నిజం దినపత్రిక. 2007*

*గణతంత్ర దినోత్సవ ప్రత్యేక సంచిక.*